

# కళ్లంలో... గలాటా

శ్రీ. ఎస్. సాంబశివరావ్ బాబ్జీ

ఆవేళ ఆదివారం పొలం చూసొద్దామని బయల్దేరాను. అక్కడో పెద్దకళ్లం వుంది. దాంట్లో రకరకాల ధాన్యాలన్నీ రాసులుగా పడివున్నై. గాలికూడా హాయిగా వీస్తోంది. ఆ చల్లటిగాలిలో నా ఊహలుకూడా మరింత యెక్కువౌసాగిన్నై. చటుక్కున నా హృదయం ఊహాప్రపంచంలో పడిపోయింది.

—గాలివిసురికి ఓ ధాన్యంగింజ గోధుమల కుప్పమీదికి వచ్చిపడింది. గోధుమలంటే స్వభావసిద్ధంగానే కోపిష్ఠివి. చీటికీమాటికీ విసుక్కునేవి. ఇలా ధాన్యంగింజ తనకుప్పమీదపడి పోవటంమాసి కోపంతో ఆవేశంతో ఉక్రోషంతో మండిపడిపోతూ హుత్, ఉత్ అని బెదిరిస్తూ,—"ఏం, మహాశయా, మీకుకళ్లుగాని కనిపించలేదా? మేం యిక్కడున్నామన్న సంగతి తెలీదా?" అంటూ అడిగింది గోధుమగింజ.

ధాన్యంగింజ మాత్రం నెమ్మదైంది.

"అబ్బే, లేదండీ, మేం మీ మీద పడాలని యెప్పుడు పళ్ళేను. గాలిమహారాజుగారి కృపవల్ల నేనింతవరకూ రావాల్సొచ్చిందిగాని మా జాగ విడిచిపెట్టి రావటానికి మాకేంపట్టింది? అయినా మీరి వ్వాళ యిల్లా దుసరుసమంటూ ఆటంబాంబయి పోవటానికిగల కారణమేంటో కాస్త సెలవిస్తారా? నేనుగాని దొంగననుకున్నారా?" అంది ధాన్యంగింజ.

గోధుమ—అఁ, దొంగవి కాకపోతే దొరవా నువ్వు? పైవాళ్ళ యింట్లోకి దొంగతనంగా పరుగెత్తుకొచ్చి పైగా యిదో డాబు—దబాయింపూను; భలే,—బావుందయ్యోయ్. నాకు శ్రీరంగనీతులు చెప్పటానికి బయల్దేరావ్? నీలాంటివాడే దొంగొచ్చి రాజుగార్ని బెదిరించాట్ట, మెడపట్టుకు అవతలికి గెంటెయ్యగలను జాగ్రత్త పోతావా పోవాయిప్పుడు లేకపోతే...

ధాన్యం—లేకపోతేగీకపోతేయేంటయ్యోయ్ నాలోసత్తువ లేదనుకోకు. ఏమాటకేనా ఓహద్దూ పద్దూ అంటూ వుండాలె. నేను అహింసావాదిగా యింతవరకూ వూరుకున్నాను. గాని మహాత్మా గాంధీ గారికిమల్లే ఓ చెంపకాయమీద ఫెడీమని కొడ్తే మరో చెంపచూపించేవాణ్ణి కాదనికూడా కాస్త గుర్తించుకో. తెలీదా నీకు మా వాగ్దానాలన్నీ—మార్చుకున్నట్టు?

గోధుమ—(సగర్వంగా) ఏమిటా వాగ్దానం?

ధాన్యం—అయితే చెప్తావిను. మొట్టమొదట మేం అహింసా పరమోధర్మః అనిచెప్తాం. అహింసా ద్వారాగానే కార్యంసాధిస్తాం. కాని పైవాడెవడేనా మామీద కొచ్చేసరికి హింసని ప్రయోగించేందుకెంతమాత్రం వెనకాడం.

గోధుమ—సరే, చాల్లే నీ వేదాంతం. ముందు దయచేయ్ యిక్కణ్నుంచి. మహా గొప్ప వాడొచ్చాడ్రా హింసను ప్రయోగించేందుకి పెద్దపెద్ద నాయకులకే దిక్కులేదుకాని యీ గాడిదికొడుకుకొచ్చింది!

ధాన్యం—(కోపంఅపుకోలేక) అయితేనన్ను గాడిద నంటావా? ఏవుర భైతువురానువ్వు? నోటికితాళం బిగించగలను. చూసుకో లేదంటే నీ రోగం కుదిరేలాలేదు. ఇంటిదగ్గిర కుక్క కూడా భోం భోం అని అరుస్తుందిగా?

గోధుమ—అయితే నేను కుక్కనిరా, కుంకా

ధాన్యం—(చెయ్యిసర్దుకుంటూ) నువ్వా కుక్కకన్నా నీచాతి నీచమైనవాడివి. కొన్నికుక్కలు గొప్పగొప్పవాళ్ల యిళ్ళల్లోకూడా మసుల్తావుంటాయ్ ఆరె, నువ్వెవరి మొహమేనా చూశేడ్వావురా నీ జన్మలో?

గోధుమ—(మూతిమీద ఒహాటి లగాయించి) ఏంవిట్రా చూసేది? నీకేం తెలుసురా ఉల్లూకాబచ్చా. ఆ పెద్దపెద్ద వాళ్ళందర్నీ నేనే పోషిస్తున్నా. వాళ్లకి నేనంటే యెంతోయిష్టం. పూరీ, హల్వా, చపాతీ, వగైరాలను నేనులేకపోతే తయారు కానేరావు. యీ పదార్థాల్ని గొపగొప్ప మహారాజుల్లాంటి వాళ్లే

తింటారు. పోనీ, నువ్వే చెప్పు. నేనెందుకు గొప్ప వాళ్ళతో తిరుగుతూవుంటానో?

ధాన్యం—(కొంచెం గంభీరంగా) ఎన్నడా పైకి కారే, యిదేనా నీబడాయి? గొప్ప కామందుల కడుపులన్నీ నువ్వు నింపుతున్నావ్. కాని, నిరుపేదలకీ కూలివాళ్ళకీ నీదగ్గిరేమైనా స్థానం వుందనగలవా? పైగా రైతు తను రాత్రీపగలూ కష్టపడి ప్రపంచానికి పట్టెడన్నం పెడుతున్నాడో అతణ్ణి నువ్వొకంట చూస్తున్నావా?—లేదు. ముమ్మాటికీ లేదు. అంటే నువ్వు నిజంగా పాపాత్ముడి వన్నమాట. కృతఘ్నుడి వన్నమాట.

గోధుమ—ఛప్. నోర్ముయ్. పాపాత్ముణ్ణి నే నెందుకవుతాను? నువ్వే వాణ్ణి పోషించి కాపాడేస్తూంటే నే నెందుకు కాదంటాను. అయినా ఎంత రైతయినా డబ్బక్కర్లే దనుకున్నావా?

ఇంతట్లోకి సగ్గుబియ్యం గారు కుంగుతూంటూ, వంగుకుంటూ వచ్చేశారు, వారిద్దరూ దెబ్బలాడుకుంటూంటే ఆనందం అనుభవించటం మొదలెట్టారు.

ఒరేయి తమ్ముడూ, మీరిద్దరూ యెందుకిట్లా కొట్టుకుచస్తున్నారు నాటు కమ్యూనిష్టులూ, కాంగ్రెసు వాళ్ళలాగా? మీకిది తెలిసిందా?

ధాన్యం, గోధుమా నివ్వెరపోతాయ్ టక్కున అడిగాయ్—"ఏంటండోయ్, ఏంటి? మాకసలు తెలీనే తెలీదు?"—

సగ్గుబియ్యం—(ఓ లోతైన నిట్టూర్పు విడిచి) ఏమ్. తెలీనే తెలీదా? దేశం యీనాడు అధోపాతాళాని కణగారి పోతూంటే. నాలుగు మూలలా ప్రచండమైన బీభత్సం బయల్దేర్తూంటే, మీకింకా తెలీదా?—అవునవును నిజమే ఎందుకు తెలుస్తుందిలెండి. ఎప్పుడు మానినా అందరికందరూ చీకటి కూపాలు మరిగి రాత్రీపగలూ కొట్లోపడియేడుస్తుంటే యింక మీకు దేశమేమైపోతే మీకేంగావాలి? అంత మయిమరిచి పోయివున్నారన్నమాట.

గోధుమ—అరెక్యారే, ఉపోద్ఘాతం మాత్రం చెప్పి వూరుకున్నావ్? అసలు సంగతి చెప్పవేం?

సగ్గుబియ్యం—(కొంచెం విచారిస్తూ) అయితే మీరు వింటారా? వినేం చేస్తారు? అయినా బలవంతం పెడుతున్నారు గాబట్టి అదిచెప్పేస్తా మనకి తండ్రిలాంటివాడు రైతుకి చాలా జబ్బుగావుంది. ప్రాణాలమీద కొచ్చింది. వాళ్ళ యింటిల్లిపాదీ జబ్బుల్తో బాధపడ్తున్నారు. మూన్నాళ్ళనించి యెవ్వరికీ తిండీ తిప్పల్లేవు. మనంవాళ్ళకి సాయం చెయ్యాల్సివుంది. అందుకుమీరు సంసిద్ధమేనా?

ధాన్యం, గోధుమ ఒకారి మొహాలింకొకరు చూసుకున్నాయ్. కాస్సేపాలోచించి,—"సగ్గన్నగారూ, నేను సాయంచేయటానికి సిద్ధంగానె వున్నానుగాని ఓ యిబ్బంది మాత్రంవుంది. వాళ్ళ జ్వరం వొదిలిపోయేదాకా నన్నువాళ్ళు ముట్టుకోగూడదే మరి!" అంది.

గోధుమ—(కొంచెంజంకి) నేను రెడీసార్, కాని అసలు సంగతేంటంటే రైతులకి నేనంటే పడదు. నన్ను అమ్మితే వాళ్ళకి అపరిమితమైన లాభం కలుగుతుంది. యింకో నాఠీవి నాదర్జా యెలాంటిదనుకున్నావ్? గొప్పగొప్ప ఇళ్ళలో నేనుస్టవ్‌ల మీద ఫస్టుక్లాసుగా ఉడుకుతూవుంటాను. కాని యిక్కడ కఱ్ఱలపొగతో కళ్లుమండిపోతాయ్.

సగ్గు—శెభాష్, నాకు మీ యిద్దరిపైనే ఆశ వుంది. ఆతనుతప్పక సాయంచేస్తాడు. నువ్వు కూడా యిలిచ్చి ... కాని బాగా ఆలోచించండి. యిప్పటి మట్టుకు వాళ్ళని సంతృప్తి పరచటం యెట్లా?

వాళ్ళు ముగ్గురూ అలా మాట్లాడుకుంటూండగా ముసలి శెనగగింజ మూలుగుతూ, నడ్డిమీద చేతినాని, ముక్కుకొస్త పైకెత్తి అక్కడికొచ్చింది. ముగ్గురూ విచారంగా వుండటం చూసి "ఒరేయి అబ్బాయిలూ, మీరంతా అదోక్కలా వున్నారేంరా?" అని అడిగింది.

అమీతట గోధుమ జరిగినకథంతా వివరంగా చెప్పింది. అంతావిని సెనగగింజ సగ్గుబియ్యం కేపు చూసి పకపకా నవ్వి—"ఏం, సగ్గూకూడా, నువ్వు యెందుకిట్టా ఏప్రిల్ ఫూల్ మొహం వేసుకూర్చు

స్తావ్ ? యీ సమస్య నీవల్ల పరిష్కారంగాదా ?'' అంది. గోధుమ, ధాన్యం మెదలకుంటూ కూచున్నై కాని...

మధ్యలో సగ్గుబియ్యం చిరునవ్వు నవ్వుతూ అంది,—''నన్నెందుకడుగుతావ్ ? ధాన్యం, గోధుమల ముందు నేనేపాటిదాన్ని. యివన్నీ వుంటుండగా నన్నడిగేదెవరు ? నక్కెక్కడ దేవలోకమెక్కడ ?''

కాని మధ్యలోనే సర్దుకుని సెనగ అంది,—''సగ్గనేస్తం, నువ్వేమన్నా చెప్పుకాని నువ్వే అందరికన్నా గొప్పవాడివంటాను. అపమానమైన వాడివంటాను, నీతో సరిపుజ్జీగా మాలో యెవ్వరూ చెయ్యదురనుకో. మేమంతా సుఖానికి స్నేహితులం గాని దుఃఖానికితోడు నువొక్కడివే. మాలో కొంతమంది ధనవంతుల కిష్టమైతే మరికొన్ని యింకొందరికి;—కాని నువ్వుమాత్రం అందరినీ సమానంగా చూస్తావు. నీదగ్గిర రాజయినా ఒకటే, రైతయినా ఒకటే. నువ్వు మానవుడికి నిజమైన మిత్రుడివి. క్షేమంకరుడివి. ఆపదలో అడ్డుపడేవాడే నిజమైనమిత్రుడని సామెత గూడావుంది. నువ్వేపీడితులను రక్షించుదాతవు. ప్రపంచాన్ని చచ్చిపోకుండా నిలబెట్టే దిక్కువి—''

రైతే, అన్నయ్యా, యింకచాల్లే నీ ఉపన్యాసం, తేగంపదండి. పాపం మనరైతుకి సాయం చేద్దాం.

సెనగ—కాని అన్నిటికన్నాముందు మీ అందరికీ ధన్యవాదాలు (యకాయకిని ధాన్యం రాశిలో దుమికి) సోదర సోదరీమణులారా, మీరంతా ఒక్కసారి నాతో జైఅనండీ—బోలో మహాత్మ సగ్గబియ్యంగారికీ—జై !

ఆధునాతనమైన రచనలు, ఆకర్షణీయమైన చిత్రాలు, ఆనందకరమైన ఆకారం. ఇవే ''కథాంజలి'' స్థిరాస్థి.

★

పాఠకుల రుచులకనుగుణంగా ప్రతీ ప్రత్యేక సంచికనూ ఓ క్రొత్త రూపంతో సమకూర్చి అందివ్వడానికి ప్రయత్నించడమే మా విధి.

★

వార్షికసంచిక వెలువడే తేదీ

**10-6-47**

**వెల 1-0-0**

★

''కథాంజలి'' ప్రతీప్రత్యేకసంచిక ఆంధ్ర పాఠకలోకానికి క్రొత్త కానుక.

ప్రత్యేక సంచికలను చదివి ఆనందించిన పాఠకుల ఏకాభిప్రాయం.

★

అపేరీతిగా మీకు నూత్నాలంకారాలతో రానున్న 8 వ వార్షిక సంచిక అందుతుంది.